క్లుప్తంగా

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా నారాయణపూర్ ,వీరెశెట్టిపల్లి, గోనూర్ ,చెన్‌గేష్పూర్, ఓగిపూర్, ఎల్మకన్నె, చిట్టి ఘనాపూర్, బెల్కటూర్, పర్వాతపూర్, చెంగోల్, పర్వాతపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు. కావునా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని కోరారు.

నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

కాంగ్రెస్ నేత విజయభాస్కర్‌రెడ్డి



ధారూరు: మండల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్‌లోని నర్సింగ్ గౌలికార్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలు హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, పార్టీ అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

గురుకులానికి ఇద్దరు బాలికలు ఎంపిక



అక్షిత (ఫైల్)



తనూజ (ఫైల్)

తాండూరు రూరల్: మండల పరిధిలోని రాంపూర్‌తండా పాఠశాలకు చెందిన విద్యార్థినులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. శుక్రవారం గురుకుల ప్రవేశ ఫలితాలు విడుదలయ్యాయి.రాంపూర్‌తండాకు చెందిన తనూజ, అక్షితలు ఫిబ్రవరి 11న గురుకుల ప్రవేశ పరీక్ష రాశారు. వీరు ఐదవ తరగతి ప్రవేశాల్లో గిరిజన సంక్షేమ పాఠశాల, వసతి గృహానికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మనోహర్ తెలిపారు. తండావాసులు, పాఠశాల ఉపాధ్యాయులు బాలికలను అభినందించారు.

చల్లబడిన కుల్కచర్ల



ముజాహిద్‌పూర్‌లో కురుస్తున్న వర్షం

కుల్కచర్ల: వేసవితాపానికి కాస్త ఉపశమనం లభించింది. శుక్రవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ పరిసర ప్రాంతంలో ఓ మోస్తారు వర్షం కురవడంతో కుల్కచర్ల, అంతారం తదితర గ్రామాల్లో వాతావరణం చల్లబడింది.

నేలకొరిగిన జొన్న పంట



పులుసుమామిడిలో నేలకొరిగిన జొన్న పంట

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి వర్షం కురిసింది. ఒక్కసారిగా బలమైన ఈదురు గాలులు వీచాయి. దీంతో మండలంలోని పులుసుమామిడి గ్రామంలోని పలువురు రైతులకు చెందిన జొన్న పంట నేలకొరిగింది. శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) కావ్య జొన్న పంటను రైతులతో కలిసి పరిశీలించారు.

నేడు ధారూరులో ప్రజా ఆశీర్వాద సభ

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్



ధారూరు: మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రజా ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభలో విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జిల్లా నేతలు పాల్గొంటారని అన్నారు. కావునా బీజేపీ శ్రేణులంతా హాజరు కావాలని కోరారు.

దాబాల్లో మద్యం జోరు

పర్మిట్ రూంలకు అనుమతి
- బార్లను తలపిస్తున్న దాబాలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



దాబాలో మద్యం సేవిస్తున్న జనాలు(ఫైల్)

పరిగి: ఆయా గ్రామాల్లో, ప్రధాన రోడ్ల వెంబడి ఏర్పాటు చేసిన దాబాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దాబాల్లో పర్మిట్‌రూంలకు అనుమతి పొంది, సిట్టింగ్ ఏర్పాటు చేయడంతోదాబాల వద్ద, బెల్టు దుకాణాల వద్ద నిత్యం గొడవలకు దారితీస్తుంది. ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు ఇచ్చిన లక్ష్యం పూర్తి చేసేందుకు బెల్టు దుకాణాల్లో, దాబాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి ఆదాయం పెంచేందుకు ఎక్కడ కూడా తనిఖీలు కేసులు నమోదు చేయడం లేదనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. గత ఏడాది నుంచి బెల్టు దుకాణాల్లో, దాబాల్లో తనిఖీలు చేసి కేసులు నమోదు చేసిన దాఖాలు లేవు.

జోరందుకున్న బెల్టు దుకాణాలు పరిగి నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెండు నుంచి 10 వరకు బెల్టుషాపులు నడుస్తున్నాయి. అంతేకాక పట్టణం, ఆయా మండల కేంద్రాల్లో విచ్చలవిడిగా దాబాలు వెలిశాయి. మద్యం వ్యాపారస్తులు ఎక్కువగా బెల్టు దుకాణాలపైనే దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 15 మద్యం దుకాణాలు ఉండగా వందల సంఖ్యలో బెల్టు దుకాణాలు ఉన్నాయి. ప్రతి మద్యం దుకాణదారులు కొన్ని గ్రామాల్లోని బెల్టుదుకాణదారు, దాబాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. ప్రతి నిత్యం మద్యం లభ్యత కావడంతో సంపాదించిన కూలీ డబ్బులు మొత్తం మద్యానికే ఖర్చు చేస్తూ నిత్యం బెల్టు దుకాణాల వద్ద, దాబాల వద్ద గొడవలకు దారితీస్తున్నాయి. బెల్టుదుకాణాలకు ఆటోల ద్వారా సరఫరా చేస్తున్న ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
గ్రామాల్లో, ప్రధాన రోడ్డు సమీపాల్లో బెల్టుదుకాణాలు, దాబాలు ఏర్పాటు చేసి దర్జాగా మద్యం విక్రయిస్తున్నారు. ఇష్టానుసారంగా అధిక రేట్లతో మద్యం విక్రయిస్తూ సామాన్యులపై గుదిబండ వేస్తున్నారు. బెల్టుదుకాణాల్లో, దాబాల్లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. బెల్టుదుకాణాదారులు, దాబా నిర్వాహకుల నుంచి ప్రతినెలా ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు అందుతున్నాయని ఆరోపణలున్నాయి. ఏ ఒక్క నెల మామూళ్లు అందని దుకాణం, దాబా ఉంటే వెంటనే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. పేదలు కూలీనాలి చేసే జనాలు కూలీ డబ్బులు మద్యానికే ఖర్చు చేస్తున్నారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

దాబాల్లో, బెల్టు దాకాణాల్లో మద్యం విక్రయించడం చట్ట విరుద్ధం. నిబంధనలకు విరుద్ధంగా దాబా ల్లో మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తీసుకు ంటాం. బెల్టు దుకాణాల్లో దాడులు నిర్వహించి కేసు లు నమోదు చేస్తున్నాం. దాబాలు ఎక్కడెక్కడా ఉన్నాయని వివరాలు సేకరించి తనిఖీలు నిర్వహిస్తాం.

– నీరజారెడ్డి, పరిగి ఆబ్కారి సీఐ

నూతన కార్యవర్గం ఎన్నిక



ఆకుల బస్వరాజ్, మండల అధ్యక్షుడు



శరణుభూపాల్, మండల ప్రధాన కార్యదర్శి

యాలాల: వీరశైవ లింగాయత్-లింగబలిజన మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నుకున్నారు. వీరశైవ లింగాయత్ యాలాల మండల గౌరవ అధ్యక్షుడిగా ఆకుల శివకుమార్, అధ్యక్షుడిగా ఆకుల బస్వరాజ్, ప్రధాన కార్యదర్శిగా శరణుభూపాల్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, అశోక్‌కుమార్, కిష్టాపూర్ రవి, బసప్ప, కార్యనిర్వాహక కార్యదర్శిగా బస్వరాజ్, సహాయ కార్యదర్శులుగా విజయ్, శశికుమార్, శంకర్, కోశాధికారిగా వీరేశం, సలహాదారుడిగా ప్రసాద్, కార్యవర్గ సభ్యుడిగా సురేశ్, బస్వరాజ్, రాజప్ప, బాల్‌రాజ్, సుభాష్, రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ ప్రక్రియ వీరశైవ లింగాయత్‌ల జిల్లా అధ్యక్షుడు పటేల్ విజయ్‌శంకర్, గౌరవ అధ్యక్షుడు మోళిగి వీరేశం సమక్షంలో నిర్వహించారు.

అధికారుల దృష్టికి తీసుకురండి!

సాక్షి ఎఫెక్ట్..

బొంరాస్‌పేట: 'జలాలు అడుగంటి.. మేకలను కట్టేసి' అనే శీర్షిక శుక్రవారం ప్రచురితమైన సాక్షి కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ప్రస్తుతం జిల్లా యంత్రాంగం తాగునీటి సమస్యపై చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో నీటివనరులైన సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మండల పరిధిలోని రేగడిమైలారంలో చేతిపంపుల వినియోగంపై నివేదికలు ఇవ్వాలని స్థానిక అధికారులను జిల్లా అధికారులు ఆదేశించారు. దీంతో మండల అధికారులు, స్థానిక పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పంచాయతీ సిబ్బంది చేతిపంపులు, మురుగునీరు, వీధుల శుభ్రతను వీధుల్లో పరిశీలించారు. ఆయా కాలనీల్లో స్థానికులకు పలు సూచనలిచ్చారు. నీటి సమస్యలున్నా, కరెంటు సమస్యలు చోటు చేసుకున్నా తమ దృష్టికి తీసుకురావాలని నాగరాజు తెలిపారు.

ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వం పథకాలు

బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మోమిన్‌పేట: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాయని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాంనాథ్‌గుడుపల్లి, దుర్గంచెర్వు గ్రామాల్లో పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో గత 10సంవత్సరాల నుంచి ఎక్కడా బాంబుల మోత వినిపించడం లేదన్నారు. కేవలం మోదీ తీసుకొనే కఠినమైన నిర్ణయాల వల్లే ఉగ్రవాదులు కన్పించడం లేదని చెప్పారు. మళ్లీ దేశంలో మోదీ ప్రభుత్వం రావాలంటే పువ్వుగుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, నాయకులు రాఘునాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకట్, నగేశ్ ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

బంట్వారం: మండల పరిధిలోని తొర్మామిడిలో బాలాజీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గత రెండు రోజుల నుంచి కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17 నుంచి ప్రారంభమైన స్వామివారి ఉత్సవాలు ఈ నెల 24 వరకు కొనసాగుతాయన్నారు. మొదటి రెండవ రోజుల్లో సీతారాముల కల్యాణం, శ్రీవారి గరుడవాహన పల్లకీ సేవ నిర్వహించారు. శుక్రవారం శ్రీవారి గజవాహన పల్లకీ సేవ కార్యక్రమం జరిగింది. 20న హనుమాన్ వాహన పల్లకీ, 21న అశ్వవాహన పల్లకీ సేవ, 22న శేష వాహనం పల్లకీ సేవ ఉంటుందన్నారు. 23న ఉదయం 7:30 గంటలకు స్వామివారి అభిషేకంతో ప్రారంభమై హోమం, లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం జరపనున్నారు. అనంతరం అదే రోజు రాత్రి 9:30 గంటలకు నల్లపోచమ్మ నాటక ప్రదర్శన అనంతరం స్వామివారి రథోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. 24న ఉదయం 8 గంటలకు హనుమాన్ జయంతి వాహనసేవ, పెరుగు బసంతం, పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి సన్నిధిలోతీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

సంక్షేమ పథకాలే కొండాను గెలిపిస్తాయి



కుల్కచర్ల: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోదరి డాక్టర్ మీరాకుమారి



దోమ :ప్రజలతో మాట్లాడుతున్న మీరాకుమారి

దోమ : భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తమ తమ్ముడు, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యాధిక మెజార్టీతో గెలిపిస్తాయని ఆయన సోదరి డాక్టర్ మీరాకుమారి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం దోమ మండలంలోని బొంపల్లి గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం పదేళ్లుగా పాలించి అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తుందని మండిపడ్డారు. దేశంలో భారత ప్రధాని నరేంద్రమోడీ భారత ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా తన తమ్ముడు మాజీ ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి బరిలో ఉన్నారని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోరల అనంతయ్య, బూత్ అధ్యక్షుడు నర్సింహాయాదవ్, బీజేపీ నాయకులు యాదయ్య, ఆంజనేయులు, రవీందర్, మల్లేశ్, హన్మంతు, మల్లయ్య, శ్రీనివాస్, నర్సింహులు, మహేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

దేశం, ధర్మం కోసం బీజేపీకి ఓటు వేయాలి
కుల్కచర్ల: దేశం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలని ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చిన్నమ్మ, కల్పనారెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని సాల్వీడు, చెల్లాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కుటుంబపాలనకు వ్యతిరేకంగా, అవినీతి రహితపాలనను అందించిందని చెప్పారు. సుభిక్షమైన పాలన కొనసాగాలంటే మోదీని మరొకమారు ప్రధానిని చేయాలని కోరారు. డబ్బులు, మాయమాటలకు మోసపోకుండా బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మైపాల్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీనివాస్, నాయకులు మైపాల్, భీమయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాస్, పోశయ్య, ముసలి తిరుపతయ్య, కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి



కడా అధికారికి వినతపత్రం అందజేస్తున్న రైతులు

బొంరాస్‌పేట: ధాన్యం అమ్ముకొనేందుకు దగ్గరలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని దుద్యాల మండలంలోని నాజ్‌ఖాన్‌పల్లి రైతులు కడా అధికారి వెంకట్రామిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పది కిలో మీటర్ల దూరంలో ఉన్న చెట్టుపల్లి తండాలో అమ్ముకునేందుకు ఏర్పాటు చేయడం తమ గ్రామ రైతులకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తుందని అధికారికి సూచించారు. గ్రామంలో 40ఎకరాల్లో సుమారు 6వేల క్వింటాళ్లకుపైగా వరిధాన్యం పండిస్తున్నామన్నారు. చెట్టుపల్లితండాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రం చాలా దూరంగా ఉందని, దగ్గరలోని నియోజకవర్గం కేంద్రంలో అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. దీంతో పరిశీలించి తగిన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విన్నవించిన వారిలో నాజ్‌ఖాన్‌పల్లి మాజీ సర్పంచు, దుద్యాల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, రైతులు సురేందర్‌రెడ్డి, మల్లప్ప, సమరసింహారెడ్డి తదితరులున్నారు.

నేడు మన్నెగూడలో క్రికెట్ టోర్నమెంట్

పూడూరు: మండలంలోని మన్నెగూడలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు డీసీసీ కార్యదర్శి పెంటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం టోర్నమెంట్‌ను ప్రారంభించేందుకు చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వస్తున్నారని తెలిపారు. గ్రామీణ, మండల, జిల్లాస్థాయి క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

తాండూరు రూరల్: ఎల్లమ్మ తల్లి సల్లంగ చూడమ్మ అంటు గ్రామస్తులు పూజలు చేశారు. మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ గ్రామంలో నూతనంగా ఎల్లమ్మ దేవాలయాన్ని నిర్మించారు. గత మూడు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధాన్యాధివాసం, జలాధివాసంతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో ఎల్లమ్మ అమ్మవారికి కల్యాణం జరిపించారు. అనంతరం బోనాలతో మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారి నైవేద్యాలు సమర్పించారు.

వీరశైవ లింగాయత్ కార్యవర్గం ఎన్నిక

తాండూరు రూరల్: తాండూరు మండల వీరశైవ లింగాయత్-బలిజ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం పట్టణంలోని వీరశైవ ఫంక్షన్‌హాల్లో సమావేశం నిర్వహించి కమిటీని ప్రకటించారు. వీరశైవ లింగాయత్-బలిజ సంఘం తాండూరు మండల అధ్యక్షుడిగా సూర్యకాంత్, గౌరవ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వినోద్ కుమార్, మల్లికార్జున్, కార్యదర్శిగా నాగరాజ్, సలహాదారు పటేల్ విజయ్, కార్యవర్గ సభ్యులుగా వీరన్న, చంద్రశేఖర్, శ్రీశైలం, నాగప్ప, మహేందర్‌లను ఎన్నుకున్నారు.

నవవధువులకు మంగళ సూత్రాలు అందజేత



మంగళసూత్రాలు అందజేస్తున్న సభ్యులు

పరిగి: మండలంలోని రంగాపూర్ గ్రామంలోని సత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఇద్దరు నవవధువులకు మంగళసూత్రాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వరలక్ష్మి, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భవానికి అందజేశారు. పేద ప్రజలకు సేవా చేయాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సత్యసాయి కృపాతో మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా కేంద్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

ఎంపీడీఓ రాములు



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: రానున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఎంపీడీఓ, స్పెషల్ ఆఫీసర్ రాములు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మద్వాపూర్‌లో నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ఏడాదికి సంబంధించి నర్సరీల్లో మిగిలిన మొక్కలను కన్వర్షన్ చేయాలని సూచించారు. తప్పనిసరిగా కనీసం 15 రకాల మొక్కలను జాగ్రత్తగా పెంచాలని, అవి ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు పట్టాలని చెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పనులపై ఆరా తీశారు. పారిశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరాపై ఆయన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకి పలు సూచనలు చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే సత్వరమే స్పందించాలని చెప్పారు.

కృత్రిమ ఇసుక తయారు చేస్తే చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

ఇసుక స్థావరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్

ఇసుక తయారీ స్థావరాల పరిశీలన

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా కృత్రిమంగా ఇసుక తయారు చేసి సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ హెచ్చరించారు. ఈ నెల 17వ తేదీ సాక్షి దినపత్రికలో 'యథేచ్ఛగా ఇసుక తరలింపు' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించడంతో అధికారులు స్పందించారు. శుక్రవారం బొంరెడ్డిపల్లి గ్రామంలోని ఆరు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టవిరుద్ధమైన పనులు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇసుక లభ్యత తదితర అంశాలను గురించి రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా పేర్కొనకపోవడం గమనార్హం. కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్‌రెడ్డి ఆరుగురు ఇసుక స్థావరాల నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే



వధూవరులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: మండల పరిధిలోని చన్గోముల్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జంగం లింగప్ప కూతురి వివాహ వేడుకల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు అర్ధ సుధాకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కద్మూరు ఆనందం, శ్రీనివాస్, షకీల్, డీసీసీ కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, నాయకులు నర్సింహారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలోని ఆయా పీఎస్‌ల పరిధిలో 50 సెల్‌ఫోన్‌లు పొగొట్టుకున్న విషయమై జిల్లా సీసీఎస్ పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డి చేతుల మీదుగా పొగొట్టుకున్న వారికి సెల్‌ఫోన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీఈఐఆర్ అనే అప్లికేషన్‌లో పొగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య, అన్వర్‌పాషా, ఎస్ఐలు జయశంకర్, కృష్ణయ్య, సిబ్బంది గోవింద్, సత్తయ్యగౌడ్, అంజప్ప, అలిమొద్దీన్, రాఘవేందర్‌రెడ్డి, రవీందర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.